## కామెడీ కథ

# చాలా ఈజీ...తెలుసా!!

**శుక్రవారం సాయంత్రం ఆరు దాటింది. హాల్లో ఉన్న ఒకటిన్నర బై ఆరు సైజు సోఫాలో వెల్లకిలా పడుకున్నాడు పర్వతాలు. అప్పుడే ఆఫీసునించి వచ్చి స్నానం చేసి రిలాక్సవుతున్నాడు. అతని భార్య రంజని పళ్లెంనిండా బియ్యం పోసుకువచ్చి అతనికి దగ్గరలో కుర్చీలో కూర్చుని బియ్యంలో రాళ్ళు ఏరుతోంది. పక్కగదిలో పిల్లలిద్దరూ కాన్వెంట్ చదువుల 'బరువులతో' కుస్తీ పడుతున్నారు.**

పర్వతాలంటే భారీగా ఊహించుకోకండి. సోఫాలో అతను పడుకున్నాక కాళ్లవైపు ఒక అడుగు పైనే ఖాళీ మిగిలిపోయింది. అతనికి కుడి ఎడమల మిగిలిన ఖాళీ మొత్తం కలిపితే రమారమి ముప్పావు అడుగు ఉంటుంది. అదీ..మన హీరో ఫిజికల్ డేటా.

ఎంతసేపటికీ పర్వతాలు ఏమీ మాట్లాడకపోయేసరికి ఒకసారి అతని వైపు చూసింది రంజని. పర్వతాలు ఎడం చేయి తలకింద పెట్టుకుని, కళ్ళు మూసుకుని కుడిచేత్తో నుదురుమీద నిమురుకుంటున్నాడు. ఆ భంగిమ చూడగానే రంజని కళ్ళు పెద్దవిచేసి చూసిందతనివంక. ఆమెకు పై ప్రాణాలు పైనే పోయినయ్. అంత తీవ్రంగా ఆలోచించాడంటే ఏదో దండగ ఖర్చు చేసే ఆలోచనే అతని బుర్రని తొలుస్తుందని అర్థం. ఇది ఆమెకు అనుభవం నేర్పిన పాఠం.

అనుకున్నట్టుగానే నెమ్మదిగా కళ్ళు తెరిచి, రంజని వంక చూసి సమస్యలన్నీ విడిపోయి ఒడ్డున పడ్డట్టు తేట నవ్వొకటి విసిరాడు పర్వతాలు. భయం నిండిన కళ్లతో అతన్ని చూసిందామె. అతని ఆడియో కూడా మొదలైంది.

''ఈ లెక్కన ఆయిల్ పెయింటింగ్ చాలా ఈజీ తెలుసా?''

''అయితే ఏంటంట?''

''మా కొలీగ్ ఒకతను దాని గురించి అంతా చెప్పేశాడు. వాళ్ళావిడ హాబీగా వేస్తుందట బొమ్మలు. నేనూ ట్రై చేద్దామనుకుంటున్నాను''

''మీరు కాగితం మీద తిన్నగా ఒక గీత కూడా గీయలేరు. మీకు ఎందుకొచ్చిందండి అంత ఖరీదైన హాబీ?''

''రంజూ! దేనికైనా ప్రోత్సాహం కావాలి. పెళ్ళానివి, నువ్వే నన్ను ఇలా దిగలాగితే ఎలా?''

మొదలయిందిక చిన్న వాదన. అది ఎలా మొదలై ఎక్కడ ముగుస్తుందో ఆమెకు తెలుసు.

''మీకున్నది ఒట్టి ఆరంభశూరత్వం. ఏ మోజూ మీకు వారం కంటే నిలవదు. దానికోసం వేలకి వేలు తగలేస్తారు. చాదస్తపు మొగుడు చెపితే వినడు, గిల్లితే ఏడుస్తాడని... మీకు తోచదు. నా మాట వినరు. అదే నా భయం. పూర్తిగా మర్చిపొండి ఆ సంగతని'' అతన్ని చెప్పనీయకుండా, తన తీర్పుని చ్చేసి అక్కడినుండే లేచింది రంజని.

''నీకన్నీ అనుమానాలే. నువ్వు నన్ను ఆర్టిస్టుగా పొగిడే రోజు దగ్గరలోనే ఉంది'' సంభాషణ ముగించేసి, టీవీ రిమోట్ కోసం వెతికాడతను.

''సాయీ...టీవీ రిమోట్ ఏదిరా?'' కొడుకుని అడిగాడు పర్వతాలు.

''నా దగ్గరుంది నాన్నా...లెక్కల నోట్స్‌కి మార్జిన్లు కొట్టుకుంటున్నా'' పక్కగదిలోంచి అరిచాడు ఎనిమిదేళ్ళ సాయి.

''రిమోటనుకున్నావా, స్కేలనుకున్నావా అంట్ల వెధవా. ఇలాతే'' అరిచాడు. వాడు నిక్కరు ఎగలాక్కుంటూ వచ్చి, రిమోట్ ఇచ్చి గాల్లోనే బస్సు స్టీరింగ్ తిప్పుతూ, ఆడియో, వీడియో ఎఫెక్ట్స్‌తో బస్సుని వెనక్కి తిప్పుకుని గదిలోకెళ్ళిపోయాడు సాయి.

★ ★ ★

శనివారం సాయంత్రం అయిదున్నర. డోర్‌బెల్ మ్రోగింది. రంజని తలుపు తీసేసరికి ఒక చేత్తో పొడవాటి ఛార్టుల ప్యాకెట్టు, రెండో చేత్తో పాలిథీన్ కవర్‌లో బ్రష్‌లు, రంగు బాటిల్స్‌తో లోపలికి వచ్చాడు పర్వతాలు. 'అనుకున్నంతా అయింది. ఎంత తగలేశారో ఏవిటో' లోలోపల అనుకుంటూ తలుపు మూసింది రంజని.

''రంజూ. మంచి పువ్వుల డిజైనున్న చీరకట్టుకోవే. ఈలోపు స్నానం చేసొస్తాను. నీ బొమ్మ గీయాలి'' రంజని వంక చూడకుండా ఆర్డరు వేసి బాత్రూంలోకి దూరాడు పర్వతాలు. తల కొట్టుకుంది రంజని. పది నిముషాల్లో బాత్రూంలోంచి బయటపడ్డాడు.

''ఇదేవిటే ఇంకా యాబ్రాసిలాగే ఉన్నావ్? బొమ్మ గీయొద్దా?''

''మీరేం పండితులయ్యారని, మీ ఎదురుగా బొమ్మ గీయమని నుంచోడానికి?''

''నాకా కిటుకులన్నీ తెలుసే. అందుకే వెనకాడకుండా ఎనిమిదొందలు పెట్టి మొత్తం బ్రష్షులు, రంగుల సెట్టు కొనుక్కొచ్చాను. అంతా బూడిదలో పోసిన పన్నీరు చేసేలా వున్నావే?'' అరిచాడు పర్వతాలు.

'ఎనిమిది వందలు గోవిందా' బాధగా మనసులో అనుకుంది రంజని.

''న్నేనున్నంచుంటా...న్నేనున్నంచుంటా'' పర్వతాలు ఎదురుగా వచ్చి తాడు లేకుండా స్కిప్పింగ్ చేయడం మొదలెట్టాడు సాయి.

''సెభాష్‌రా సాయి. ఈమాత్రం ఎంకరేజ్‌మెంట్ చాలు. అదరగొట్టేస్తా'' చిటికెలేస్తూ సాయిని గదిలోకి తీసుకెళ్లాడు పర్వతాలు.

వంటగదిలో ఉన్న రంజనికి పక్కగదిలో జరుగుతున్నది కనపడడం లేదు కాని, మాటలన్నీ వినబడుతున్నాయి.

''చొక్కా విప్పెయిరా సాయీ. లాగూ ఉంచుకో. జుట్టు బాగా చెరిపేసుకో. ఆ మూలకెళ్ళి అటు వెనక్కి తిరిగినుంచో. నడుం మీద చేతులేసుకో. తల కొంచెం వెనక్కి తిప్పి నన్ను చూడు..ఇంకా...ఇంకా కొంచెం మెడ తిప్పరా సన్నాసీ...నడుం కదపకు. చంపేస్తా... ఉండు నేనొస్తున్నా'' రెండు క్షణాలు సైలెన్స్.

''హమ్మా. మెడ నొప్పెట్టింది'' కెవ్వున సాయి వేసిన కేక, ఏడుపూ ఒకదాంట్లో ఒకటి మిక్సయి వినిపించాయి. పరుగున గదిలోకి వెళ్లింది రంజని.


''ఛీ, అరగుండు వెధవా. చెప్పినట్లు నుంచోడం కూడా రాదు'' మెడ పట్టుకుని కూర్చుండిపోయిన సాయి మీద మండి పడుతున్నాడు పర్వతాలు.

రంజనిని చూడగానే మరింత రెచ్చిపోయి-

''ఎలాంటి కొడుకుని కన్నావే. చెప్పింది అర్థం చేసుకోవడం చేతకాదు వెధవాయికి'' అన్నాడు.

''చాల్లెండి నిర్వాకం. ఉన్నవాడిని ఉన్నట్టు ఉండనీయక నెత్తిమీదకి తెచ్చారు'' సాయిని లేవదీసి మెడ వెనక చేయివేసి నడిపించుకు తీసుకువెళ్లింది రంజని.

ఈ సందర్భంగా రంజని సాధించిన సాధింపులకి ఆదివారం అంతా డల్‌గా పడుకున్నాడు పర్వతాలు. అతను ప్రదర్శించిన అత్యుత్సాహం ఫలితంగా సోమవారం నుండి మొదలయిన వీక్లీ టెస్టులకి



సాయికి బదులు అతని లీవ్ లెటర్ వెళ్లింది కాన్వెంట్‌కి.

వీసమెత్తుకూడా నిరుత్సాహపడలేదు పర్వతాలులోని కళాకారుడు. ఆ మర్నాడు పొద్దుట హాలు ఊడుస్తున్న పనిమనిషి జాలమ్మను చూడానే అతని బుర్రలో మెరుపు మెరిసి మళ్లీ కదలిక వచ్చింది. పడగ్గదిలోకి పరుగెత్తి బోర్డు, చార్టు, పెన్సిల్, రబ్బరు సిద్ధం చేసుకుని కూర్చున్నాడు పర్వతాలు. గది ఊడ్చడానికి జాలమ్మ గదిలోకి రాగానే అద్భుతాన్ని వివరిస్తున్నట్టు-

''చూడు జాలమ్మా, నువ్వు అయిదు నిమిషాలు కదలకుండా నుంచుంటే అచ్చం నీలానే బొమ్మగీసి పెడతా'' ఇరవై సంవత్సరాల జాలమ్మ అర్థం అయ్యీ, కానట్టు ముఖం పెట్టింది.

''నే చెప్పినట్టు చేతులు పెట్టి అక్కడ నుంచో చాలు. ఇంకేం చెయ్యనక్కరలేదు''

ఆనందపడిపోయింది జాలమ్మ. చీపురు పక్కన పడేసి పర్వతాలు చూపించిన చోటులోకి వచ్చి బిగుసుకుపోయి నుంచుంది.

''రిలాక్స్..రిలాక్స్‌గా నుంచో. అలా కళ్ళు పెద్దవి చేసి, భుజాలు బిగించి నుంచుంటే ఎలా? అమ్మోరులా వస్తుంది బొమ్మ''

పైట బాగా సర్దుకుని, నడుం చుట్టూ బిగించుకుని, మూర సైజున్న జడ భుజం మీంచి ముందుకు లాక్కుని, చేతులు కట్టుకు నుంచుంది జాలమ్మ.

నొప్పితో మెడ ఇంకా వంకరగానే పెట్టుకు తిరుగుతున్న సాయి ఒకసారి గదిలోకి తొంగిచూసి, జరుగుతున్న తతంగం చూడగానే బెదిరి పారిపోయాడు వెనక్కి.

జాలమ్మ వంక అయిదు సెకన్లు చూసి పెన్సిల్‌తో చార్టు మీద ఒక గీత గీశాడు పర్వతాలు.

మళ్లీ ఒకసారి చూసి మరొక గీత గీశాడు.

మరోసారి తల పైకెత్తి కళ్ళు చిట్లించి చూశాడామె వంక ''లాభం లేదే జాలమ్మా. పైట తీసెయ్'' పెన్సిల్ గెడ్డానికి ఆన్చుకుంటూ అన్నాడు పర్వతాలు.

అదిరిపడింది జాలమ్మ.

రన్నింగ్ రేస్‌కి సిద్ధంగా నుంచున్న రన్నర్‌లా నుంచుంది గుమ్మం వైపు తిరిగి.

''సిగ్గుపడకే. బొమ్మ బాగా వస్తుందప్పుడు'' లేచి రెండడుగులు ముందుకేశాడు పర్వతాలు.

''అమ్మగారూ...'' చీపురు కూడా మరచిపోయి, రెండు గెంతుల్లో గది బయటకు దూకింది జాలమ్మ.

''ఇదిగో నిన్నే జాలమ్మా..ఆగు నీకేం కాదు'' వెనకే స్పీడ్‌గా బయటికొచ్చాడు పర్వతాలు.

ఎర్రబడ్డ ముఖంతో ఎదురొచ్చి నిలబడింది రంజని, నడుం మీద చేతులేసుకుని. ముందుకెళ్ళాలో, వెనక్కి వెళ్ళాలో వెంటనే అర్థం కాలేదతనికి. పెన్సిల్‌తో తల గోక్కుంటూ- ''అదికాదే రంజూ. బొమ్మ...జాలమ్మ'' వాక్యంలో కర్త, కర్మ, క్రియలు ఎక్కడ పెట్టి మాట్లాడాలో తోచడం లేదతనికి రంజని ముఖంలో ఫీలింగ్స్ చూశాక.

''సరిసరి, ఆఫీసుకు టైం అవుతోంది తెమలండి త్వరగా'' వాయిస్‌లో డెసిబిల్స్ నంబరు పెంచి చెప్పి వెనక్కి తిరిగింది రంజని.

జాలమ్మ మొరటు మొగుడు గుర్తొచ్చేసరికి రంజని గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి.

ఆరోజు పడగ్గదికి బయట నాలుగు అడుగుల దూరంగా నడుస్తూ పని పూర్తిచేసుకుంది జాలమ్మ. ఎప్పుడా ఇంట్లోంచి బయటపడదామా అన్నట్టుంది జాలమ్మ ముఖం. అంతా గమనిస్తూనే ఉంది రంజని. 'ఈ నిమిషం నుంచి ఇరవై నాలుగ్గంటలు కాలం ఏ గొడవా లేకుండా గడిస్తే చాలు, గండం నుంచి బతికి బయటపడ్డట్టే' అని అను

శారదాప్రసాద్

## ఆత్మవిశ్వాసం

కొన్ని సంఘటనలు జరిగితేనే మనలో ఆత్మవిశ్వాసం, పట్టుదల ఎలాంటివో తెలుస్తాయి. 'లేచింది మహిళా లోకం' అని వనితలు వేయినోళ్ళ పాడుకున్నా తమ ప్రతి అడుగు వెనుక పురుషుడి భాగస్వామ్యాన్ని, సలహాని కోరుతుంటారు. అమృతా అరోరా కూడా సినిమాల్లోకి వచ్చిన కొత్తలో ఇలాంటి అనుభవాలనే చవిచూసిందిట. సినిమా షూటింగుల్లో ఇతర సందర్భాల్లో ఎదురైన కష్టాలని తలచుకుని బాధపడే తనకి సల్మాన్, అర్బాజ్‌లు ఎంతో సహకరించారంటోంది. ఇలాంటి సమస్యలు ఎదురైనప్పుడే ఆత్మవిశ్వాసం పెరుగుతుందని చెప్పే అమృతా ఇప్పుడు మార్షల్ ఆర్ట్స్ అభ్యసిస్తోంది. దేనికైనా ఒక అనుభవం కావాలని పెద్దలంటుంటారు ఇలాంటి వాటిని ఉద్దేశించేనేమో!

కుంది మనసులో. తెల్లారితే చాలు ఏదో ఒక అనర్థం వచ్చి నెత్తిన పడుతోంది, పర్వతాలుకున్న వేపకాయంత వెర్రి ఫలితంగా. ఇక ఎంతోకాలం భరించలేనని, ఒక నిశ్చయానికొచ్చింది రంజని.

ఆరోజు రాత్రి భోజనాలయ్యాక పిల్లలు మంచాలెక్కారు. పడగ్గదిలో చేరిన పర్వతాల్ని రమారమి నలభై నిమిషాలపాటు నిప్పులగుండంలో కూర్చోపెట్టింది రంజని. పర్వతాలుకు బ్రెయిన్ వాష్ చేసింది. ఆ నలభై నిముషాల్లోనూ ఆమె నుండి 'నో' అర్థింపులు 'నో' బ్రతిమాలడాలు. అన్నీ ఆర్డర్సే జారీ అయ్యాయి. ఏతావాతా పిచ్చి పిచ్చి వేషాలు కట్టిపెట్టి దండగ ఖర్చులు ఈ క్షణం నుంచీ మానుకోమని తిరుగులేని శిలాశాసనాలు జారీ అయ్యాయి. 'శోష వచ్చేలా అరిచి చెప్పాను. కుక్కతోక చందం చెయ్యరు కదా!' అనుకుంటూ కళ్ళు మూసుకుంది రంజని.

★ ★ ★

ప్రశాంతంగా ఒక నెల రోజులు గడిచాయి. పర్వతాలు బుర్రలో పడిన కొత్త బీజం గురించి తెలియని అమాయకురాలైన రంజనికి మాత్రమే ఆ 'ప్రశాంతత', పర్వతాలుకు కాదు. అతని బుర్రలో రోజుకో చిగురుటాకు తొడుగుతూ ముచ్చటగా పెరిగి పెద్దదైంది, కొంపలు ముంచే మరో కోరిక.

ఆరోజు శుక్రవారం. ఆరు దాటింది. సోఫాలో వెల్లకిలా పడుకుని కళ్ళు మూసుకుని, నుదురు రుద్దుకుంటున్న పర్వతాలు కళ్ళు తెరిచి రంజని కోసం చూశాడు. పిల్లాడి పుస్తకానికి అట్టవేస్తోంది రంజని.

''ఈ లెక్కన కథల్రాయడం చాలా ఈజీ'' నెల్లాళ్ల క్రితం వినపడిన అదే వాక్యం మళ్లీ వినబడింది. కొంచెం మార్పుతో తొట్రుపాటు కనబడనీయకుండా కంట్రోల్ చేసుకుని ''చూద్దాం. తరువాత మాట్లాడదాం. ఇప్పుడు నన్ను డిస్టర్బ్ చేయకండి'' బలవంతాన టాపిక్‌కి ఫుల్‌స్టాప్ పెట్టించింది రంజని.

అలా అతని నోరు మూయించింది కాని ఆమె తలలో బాంబర్ విమానాలు లేచి ఎగరసాగినయ్.

'మరో కొత్త తంటా తెచ్చిపెట్టాడు. ఇంకేం ఆపదలొచ్చిపడతాయో భగవంతుడా' అంటూ ఆలోచిస్తున్న ఆమెకు తల దిమ్మెత్తిపోయింది. అయినా కథలు రాయడం అంటే ఓ మూల కూర్చుని పెన్ను, కాయితాలతో కుస్తీ పట్టడమే కాబట్టి, ఆ ప్రక్రియలో అంత ప్రమాదం లేదనిపించి కుదుటపడింది రంజని. కానీ పర్వతాలు ఏకాగ్రతను, కార్యసాధనలో అతను ఎంచుకునే పద్ధతులను తక్కువగా అంచనా వేసిన రంజని, ఆ తరువాతి రోజుల్లో మరో మారు తలకొట్టుకోవాల్సి వచ్చింది.

ఇక రంజని సిగ్నల్ కోసం ఎదురుచూడలేదు పర్వతాలు. మర్నాడు సాయంత్రానికి దస్తా తెల్లకాయితాలు, దస్తారూళ్ళ పేపర్లు, రెండు బాల్ పెన్‌లు, పన్నెండు పెన్ రీఫిల్స్ పాకెట్లు పట్టుకుని ఇంటికొచ్చేశాడు. ఆదివారం అంతా ఆలోచనల్లో పడి ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడలేదు. మరమనిషిలా కళ్ళు తిప్పుతూ మౌనంగా ఇంట్లో తిరిగాడు.



పర్వతాలు చాలాసేపు గదిలోనే గడిపాడు. రాస్తున్నది చూద్దామని రంజని దగ్గరకు వెళ్లినా కాయితాలు వెనక్కి దాచుకుని ''కథ రాసేటప్పుడూ, బొమ్మ గీసేటప్పుడూ, సినిమా తీసేటప్పుడూ చూడకూడదు. థ్రిల్లుండదు'' తలపండిన రైటర్‌లా ఫోజు కొట్టి చెప్పాడు. అతని సిన్సియారిటీని చూసి, ముచ్చటపడి తలుపులు దగ్గరకి జారేసి వెళ్ళిపోయింది.

వాక్యాలు ముందుకు నడవక, అసహనంగా ఉంది పర్వతాలుకు. కాయితాలు పెన్నూ పట్టుకుని డాబా ఎక్కాడు. పిట్టగోడకు జారబడి, ఆకాశంలోకి చూస్తూ ఆలోచిస్తున్నాడు 'థీమ్' గురించి. ఇంతలో అతని చెవుల్లో పడింది, పక్క ఇంట్లో క్రిష్టియన్ ఫాదర్ చేస్తున్న బైబిలు ప్రసంగం. ఆదివారం రోజు పొద్దుట వాళ్లకి ప్రార్థనా సమయం. బైబిలు వల్లె వేస్తున్నాడు ఫాదర్.

''ఇది దేవుని గొప్పవాక్యమూ...చెప్పుచున్నానూ...వినుడు. ఆకాశములో గెద్ద తిరుగుచుండెను. భూమి మీద కోడిపిల్ల తిరుగుచుండెను. గెద్ద ఆకాశంలో ఉన్నది. కోడిపిల్ల భూమి మీద ఉన్నది...'' వాక్యం ఎంతకీ తెగడం లేదు. వింటున్న పర్వతాలుకి ఒక పక్క విసుగొచ్చినా, గెద్ద కోడిపిల్లని ఏం చేస్తుందన్న సస్పెన్స్ పెరుగుతున్న కొద్దీ అతను ఇంకా శ్రద్ధగా విన్నాడు కథకు మంచి పాయింట్ దొరుకుతుందన్న ఆశతో. గెద్దని, కోడిపిల్లని, ఆకాశాన్నీ, భూమినీ అదే వాక్యంలో అటు ఇటు మార్చి మరో మూడుసార్లు అదే వాక్యం చదివి చివరకు డిక్లేర్ చేసేశాడు ఫాదర్-

''కుండకొట్టి, మట్టితట్టి, ఈ నా చెప్పు

ముక్కలను మీ నోటిలో వేసుకొనుడు..ఇరవై రెండవ అధ్యాయము, ఆరవ ప్రకరణము, పన్నెండవ వాక్యము చదువుకొనుడు''.

పర్వతాలుకు సస్పెన్స్ తెగకుండానే మిగిలిపోయింది. పైగా చెప్పుముక్కలు నోట్లో ఎలా వేసుకోవాలో అర్థం కాని పరిస్థితిలో మేడ దిగి కిందికి వచ్చేశాడు. 'చెప్పుముక్క'లంటే ఆయన చెబుతున్న మాటలని పర్వతాలుకి అర్థంకాలేదు.

సోమవారం పిల్లల్ని స్కూల్‌కి పంపించి, పర్వతాలుకి హాట్ ప్యాక్ సర్దుతూ వంటింట్లో హడావిడి పడుతోంది రంజని. అటుగా వచ్చిన పర్వతాలు చూశాడది. ''అదేవిటి లంచ్ బాక్స్ సర్దుతున్నావ్? వారం రోజులు సెలవు పెట్టాను ఆఫీసుకి'' అన్నాడు.

రంజనికి నోట మాటరాలేదు కొంతసేపు. ''ఎందుకూ?'' తేరుకుని అడిగింది.

''ఎందుకేవిటి కథ రాయాలి'' ఫిక్సయిపోయిన షెడ్యూలు నీకు తెలియదా అన్నట్లు ఆమె వంక చూశాడు.

''సాయంత్రాలు రాసుకోవచ్చు కదా కథలు''

''మూడ్స్ అన్నవి సాయంత్రాలే వస్తాయా?'' వెర్రిదాన్ని చూసినట్టు చూసి గదిలోకి వెళ్ళిపోయాడు పర్వతాలు.

★ ★ ★

సెలవు పెట్టిన రోజులు ఒకటొకటిగా కరిగిపోయాయి. ఎల్లుండే ఆఫీసుకెళ్లాలి. కథకి 'ఓం' కూడా రాయలేదు. ఆరోజు పర్వతాలు అదృష్టం పండిందో, పాపం పండిందో మరి, ఆ 'పండించిన' వాడికే తెలియాలి. ఆ వీధిలో ఉంటున్న ఇనపకొట్టు వ్యాపారి తమ్మయ్యగారి అమ్మాయి అతి రహస్యంగా కిడ్నాప్ అయి, అత్యంత రహస్యంగా ఇంటికి చేరుకున్నది. పెళ్లీడుకొచ్చిన పిల్ల, భవిష్యత్తు బూడిదైపోతుందని ఆ విషయాన్ని వాళ్ల కుటుంబసభ్యులు అతి గోప్యంగా దాచేశారు. తమ్మయ్యగారి ఆఖరి తమ్ముడు పర్వతాలుకు కాలేజ్ మేట్, బాగా క్లోజ్. అతను మాటల్లో చెప్పాడా విషయం పర్వతాలుకు, బాధపడుతూ. 'కథ' దొరికిపోయింది పర్వతాలుకి. 'వాస్తవ సంఘటనలు కానీ, నీ కథలో యథాతథంగా రాశావో, నీ కథ పత్రికలో పడి హిట్టై కూర్చుంటుంది' అతని కొలీగ్ కథ రాయడానికిచ్చిన టిప్స్‌లో ఆణిముత్యంలాంటి మాట గుర్తొచ్చిందతనికి.

ఇక ఆలస్యం చేయలేదు పర్వతాలు. ఇంటికెళ్లాడు. హోంవర్క్ చేస్తున్న సాయిని చాటుకి తీసుకెళ్లాడు.

''ఒరేయ్ సాయీ పెన్సిల్, పుస్తకం పట్టుకుని నువ్ నాతో రా. తమ్మయ్య అంకుల్ ఇంటికి తీసికెళతా. అక్కడ అంకుల్ చెప్పేవన్నీ నువు పుస్తకంలో రాసుకోవాలి''

''అంకుల్ నాకు డిక్టేషన్ ఇస్తారా?''

''డిక్టేషన్ కాదురా సన్నాసీ. అంకుల్‌తో నేను మాట్లాడుతుంటాను. అప్పుడు అంకుల్ మాట్లాడే మాటలన్నీ నువ్ బుక్‌లో రాసుకోవాలి''

''మరి నీ మాటలు?''

''ఛస్తున్నాన్రా నీతో పిచ్చిపీనుగా. అలా క్కాదు.. 'మీరు ఊరెళ్ళి ఎప్పుడొచ్చారు' అని నేను అంకుల్ని అడిగాననుకో. 'నిన్న వచ్చాను' అంటాడు అంకుల్. అప్పుడు నువ్వు 'నిన్న' అని నీ బుక్కులో రాసుకోవాలన్నమాట''

''సరే.అర్థం అయింది'' బుక్కు, పెన్సిల్, రబ్బరు, బ్లేడూ తీసుకుని జేబులో వేసుకున్నాడు సాయి.



''బ్లేడ్లూ, రబ్బర్లూ ఎందుకురా?''

''పెన్సిలు ముల్లు అస్తమానం విరిగిపోతోంది నాన్నా''

''సరే ఎలాగోలా తగలడు, అన్నట్టు మర్చిపోయాను అంకుల్ మాటలు అన్నీ రాయొద్దు. ముఖ్యమయినవే రాయాలి''

''అదెలా నాన్నా! నాకెలా తెలుస్తుంది?''

''అదెలా అంటే అంకుల్ చెప్పేటప్పుడు నేను నిన్ను మెడమీద కానీ, వీపుమీద కానీ, చేతిమీద కానీ, తొడమీద కానీ చిన్న దెబ్బ వేస్తాను. అప్పుడు నువ్వు ఆ మాటని రాసుకోవాలి''

''గట్టిగా కొట్టకూడదు''

''లేదులేరా. ఇలా కొడతా...సరేనా?'' అంటూ చిన్నగా తాకి చూపించాడు పర్వతాలు.

చొక్కా చేతులు పైకి మడుచుకుంటూ పర్వతాలు, నిక్కరు పైకి లాక్కుంటూ సాయి- గేటు

## కొత్త గెటప్

అందాల పోటీనుంచి అంతర్జాతీయ తారగా ఎదిగిన ఐశ్వర్యారాయ్ ఇప్పుడు సరికొత్త గెటప్‌లో కన్పించడానికి ప్రయత్నిస్తోంది. నవరసాల్లో శృంగారానికి ప్రథమ ప్రాధాన్యత ఇచ్చారు మన కవులు. ఇప్పుడు చాలామంది తారలు శృంగార సన్నివేశాలకి సై అంటూంటే కొంతమంది మడి కట్టుకు కూర్చున్నట్టున్నారు. అయితే వారి మనసులు కూడా కరిగి తమని అభిమానులకు విందు చేయాలనుకుంటున్నారు. ఇప్పుడు ఐశ్వర్య రాయ్ తన నటనలో కొంచెం శృంగార పాళ్ళు కలుపుతోందంటున్నారు. ఆమె నటిస్తున్న ఆంగ్ల చిత్రం 'బ్రైడ్ అండ్ ప్రైజుడిస్'లో ఆమె కొన్ని హాట్ సన్నివేశాల్లో నటించింది. ఆమె నెచ్చెలికాడు వివేక్‌తో కలిసి నటిస్తున్న 'క్యా హో గయా నా?'లో కూడా ఆమె మత్తెక్కించే ముద్దు సన్నివేశంలో నటించిందిట. ఈ సినిమాల విడుదల కోసం అభిమానులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

దాటుతుండగా చూసి అడిగింది రంజని ''ఎటు వెళుతున్నారిద్దరూ?'' అని.

''ఇప్పుడే...పది నిముషాలు..వచ్చేస్తాం'' ఇద్దరూ వెళ్లిపోయారు.

★ ★ ★

''రండన్నయ్యగారూ కూర్చోండి'' తమ్మయ్య గారి భార్య సరోజిని తలుపు తీస్తూ ఆహ్వానించింది.

''తమ్మయ్యగారు లేరామ్మా?''

''ఇప్పుడే స్నానానికి వెళ్ళారు. వచ్చేస్తారు కూర్చోండి'' దూరంగా తలుపు దగ్గర నిలబడింది సరోజిని.

''అంతా బాగున్నారామ్మా?''

''ఆఁ ఏదోలెండి, అలా ఉన్నాం'' పర్వతాలు పరామర్శకే వచ్చాడని అర్థమైంది సరోజినికి.

కొద్దిసేపు నేలవంక చూస్తూ చేతులు కట్టుక్కూర్చున్నాడతను. అతని పక్కనే బుక్కులో పెన్సిల్ పెట్టుకుని రెడీగా కూర్చుని సరోజినిని, పర్వతాన్ని మార్చి మార్చి చూస్తున్నాడు సాయి. తను వచ్చింది తన 'కథ'కు మెటీరియల్ కోసం కాబట్టి పర్వతాలే ముందు కదిపాడు.

''పాప ఇక్కడే ఉందామ్మా? మీ ఊరు పంపించారా?''

తన మరిదికీ, పర్వతాలుకు ఉన్న స్నేహం గురించి బాగా తెలుసు కాబట్టి సరోజిని సంకోచించలేదు. ''కొన్నాళ్ళు దూరంగా ఉంచాలని, మా తమ్ముడింటికి పంపించేశాం అన్నయ్యగారూ'' అంది.

పర్వతాలు సాయిని మెడ మీద చిన్నగా తట్టాడు. సాయి పేజీ తిప్పి చకచకా రాసేసుకున్నాడు.

''ఎలా జరిగిందమ్మా ఈ దారుణం? ఎవ్వరికీ ముందుగా తెలియలేదా?''

''ఆరోజు ఫోన్ వచ్చేవరకూ, అది కాలేజీలోనే ఉందని అనుకున్నాం''

పర్వతాలు సాయి భుజం మీద చిన్నగా చరిచాడు. సాయి చకచకా..

''వాళ్ళు ఏ ఊరివాళ్ళు, ఎవరో చెప్పారా?''

మళ్లీ తట్టాడు సాయిని రెడీగా ఉండమని.

''ఇక్కడివాళ్ళు కాదండీ. కిరాయి వాళ్లని తెలిసింది''

''పోలీసు రిపోర్టేదీ ఇచ్చారా?''

''రిపోర్టివ్వలేదు. కానీ ఈయన పోలీసులకు డబ్బులిచ్చి రహస్యంగా ఎంక్వైరీ చేయించారు అన్నయ్యగారూ''

అరచేత్తో సాయిని తట్టాడు పర్వతాలు. సిగ్నల్ అందుకున్న సాయి వెర్బాటం రికార్డు చేస్తున్నాడు. తల కదపకుండా ఓర కంటితో రాస్తున్న రాతను చూశాడు పర్వతాలు గర్వంగా.

పర్వతాలు సాయిని తిట్టడం, సాయి సరోజిని వంక చూస్తూ బుక్కులో రాసేసుకోవడం సరోజిని కంట పడింది కాని, పూర్తిగా అర్థం కాలేదు ఏం జరుగుతోందో.

''ఎందుకు చేశారట ఈ పాడుపని?''

''ఇంకెందుకన్నయ్యగారూ..డబ్బు గుంజడానికి'' సమాధానం చెబుతూనే తండ్రీకొడుకుల్ని బాగా పరిశీలించి చూసింది సరోజిని. పర్వతాలు సంకేతాలు, సాయి రాసుకోవడం పూర్తిగా అర్థమైందామెకు.

ఇంతలో తమ్మయ్యగారు స్నానంచేసి లుంగీ, బనీను, తడితువాలుతో చెవులు తుడుచుకుంటూ భారీకాయాన్ని లాగుతూ వచ్చి- పర్వతాలు ఎదురుగా కూర్చోబోతూ, సరోజిని వైపు తిరిగి-

''మీ అన్నయ్యకు కాఫీ ఇచ్చావా?'' అన్నాడు.

''ఇలా రండొకసారి'' సరోజిని లోపలకు పిలుచుకెళ్లింది తమ్మయ్యను.

రెండు నిముషాల తర్వాత బయటికొచ్చి ఇద్దరి ఎదురుగా కూర్చున్నాడు.

అతని చూపు తీరు మారిపోయింది.

'మీ ఇద్దరి సంగతి అర్థం అయింది. తేలుస్తాను' అన్నట్టుగా ఉన్నాయి అతని చూపులు.

తలుపులు మూసేసిన గదిలో ఎలుగుబంటి ఎదురుగా ఉన్నట్టుంది పర్వతాలుకు. తనలో సన్నటి వణుకు తనకే స్పష్టంగా తెలుస్తోంది. చుట్టూ వాతావరణాన్ని అంచనా వేయలేని సాయి నిబ్బరంగా కూర్చుని పెన్సిల్ ముల్లుని బ్లేడుతో చెక్కుతున్నాడు పర్వతాలు వంక చూడకుండా.

''చెప్పు పర్వతాలూ...ఏంటిలా వచ్చావ్?'' కళ్ళు చిట్లించి చూస్తూ అడిగారు తమ్మయ్యగారు.

''అదే...ఏమిటిలా జరిగిపోయిందా అని బాధ కలిగి...చూసిపోదామని''

పర్వతాలు మాట పూర్తయ్యేసరికి అనుభవం వచ్చేసిన సాయి బుక్కులో రాయడానికి పెన్సిల్ స్టడీగా పట్టుకుని తమ్మయ్యగారి వంకే చూడసాగాడు. ఆయన కూడా సాయిని, అతని చేతిలో బుక్కునూ చూస్తూ-

''ఏంటి బుక్కులో రాస్తున్నావ్? చూడనీ''

అంటూ వంగి బుక్కు లాక్కోబోయాడు.

అంత భారీకాయం కుర్చీలోంచి కదిలేందుకు పట్టిన టైంలో-

''సాయీ, పరిగెత్తరా...పారిపో'' వణికిపోతున్న గొంతుతో కీచుగా అరిచాడు పర్వతాలు.

సాయి తూనీగలాగా పరిగెట్టి, కాంపౌండు దాటి గేటు తీసుకుని పారిపోయాడు. ఆ వెనకనే పర్వతాలూ లేచి కంగారుగా బైటకు అడుగు వేయబోయాడు. వెనకనించి పర్వతాలు మెడను ఎడమ చేతిలో ఇరికించుకున్నాడు తమ్మయ్య.

''ఎందుకొచ్చావ్ ఇక్కడికి? మర్యాదగా చెప్పు. ఏంటి నీ కొడుకు ఇంతసేపూ బుక్కులో రాసింది?'' ఒంటి చేత్తోనే పర్వతాల్ని దగ్గరగా లాక్కుని గుంజేస్తూ-అడిగాడు తమ్మయ్య.

''ఏదో వాడి నోట్సు''

''నోట్సా..ఇక్కడ కూర్చుని? అయితే ఎందుకు పారిపోయాడు?'' పళ్ళు కొరుకుతూ అడిగాడతను.

పర్వతాలు మెడ చుట్టూ కొండచిలువలా బిగుసుకుపోతోంది తమ్మయ్య చెయ్యి.

ఊపిరి అందక దగ్గుతెర వచ్చింది పర్వతాలుకి.

ఛస్తాడని భయపడి పట్టు వదిలాడు తమ్మయ్య. సాయి కంటే రెట్టింపు వేగంగా బయటకు దూకి పరిగెత్తాడు పర్వతాలు.

రొప్పుతూ ఇంటికి చేరేసరికి, సాయి రాసిన పుస్తకం రంజని చేతిలో ఉంది. సాయి చేతులు కట్టుకుని భయం భయంగా రంజని వంకే చూస్తూ నిలబడి ఉన్నాడు. అక్కడ అంతకుముందు ఏం జరిగిందో పూర్తిగా అర్థం అయిపోయింది పర్వతాలుకు. అతని పంచప్రాణాలూ గాల్లో కలిసిపోయాయి. ఒళ్ళు చల్లబడిపోయింది. ఇక ఎటూ పరిగెత్తే ఓపిక లేక కుర్చీలో కూలబడిపోయాడు. చావు తప్పి కన్నులొట్టబోయిందతనికి.

ఆ రాత్రి రంజని వార్నింగ్ విడాకుల వరకూ వెళ్లింది. మారుమాట్లాడకుండా విని పడుకున్నాడు పర్వతాలు, కథలు రాసే ప్రయత్నాన్ని తాత్కాలికంగా వాయిదా వేద్దామని నిశ్చయించుకుని.

★ ★ ★

నెల తరువాత..

ఆరోజు శుక్రవారం.

సాయంత్రం ఆరు దాటింది.

సోఫాలో నుదురు నిమురుకుంటూ పడుకున్న పర్వతాలు, కళ్ళు తెరచి రంజని వంక మెరిసే కళ్లతో చూస్తూ అన్నాడు.

''రంజూ, ఈ లెక్కన జాతకాలు రాయడం చాలా ఈజీ తెలుసా?...''

